క్లుప్తంగా

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సోమందేపల్లి: మల్బరీ, పాడి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అఖిల భారత రైతు వ్యవసాయ కూలి సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగముత్యాలు తెలిపారు. సోమందేపల్లిలో మంగళవారం రైతులతో ఆయన సమావేశమై మాట్లాడారు. రైతులకు పంట పెట్టుబడికి డబ్బులు లేక అప్పులు పాలవుతున్నారన్నారు. వెంటనే పట్టు రైతులకు గూళ్లకు కిలో రూ.700 ఇన్సెంటివ్ ఇవ్వాలన్నారు. నకిలీ ఎరువులు, పురుగు మందుల అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు.

మండలాభివృద్ధి ప్రణాళికపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కర్

అమరాపురం: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో మండలాభివృద్ధి ప్రణాళికపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ 2024 –25కు సంబంధించి యాక్షన్ ప్లాన్ తయారీపై చర్చించారు. మండలంలో ఏఏ అభివృద్ధి పనులను చేయాలి? తదితర విషయాలపై చర్చించారు. మండల స్పెషల్ అధికారి నరసింహమూర్తి , ఏఓ.మంజునాథ, ఇరిగేషన్ ఏఈ భార్గవ్, ఏపీఎం.తిప్పన్న ఏపీఓ జగదీష్, జేఈ. జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సాకు నివాళి



మదర్‌థెరిస్సా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత ప్రజా సంఘాల నాయకులు

హిందూపురం: ఎంతోమంది అభాగ్యులను ఆదుకుని పేదలను ఆదుకుని కరుణామయిగా నిలిచిపోయిన మదర్ థెరిస్సా సేవలు మరువలేనివని దళిత, ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. మదర్ థెరిస్సా 114వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక మున్సిపల్ ఆఫీసు ఎదురు ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

హిందూపురం అర్బన్: హిందూపురం మండల సర్వ సభ్య సమావేశం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరేంద్రకుమార్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు మున్సిపల్ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు ఎన్నికలు

పావగడ: స్థానిక మున్సిపల్ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు రెండో విడత ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. అధ్యక్ష స్థానానికి 4వ వార్డు కౌన్సిలర్ సుదేశ్‌బాబు, 14వ వార్డు కౌన్సిలర్ పిహెచ్ రాజేశ్ ప్రధాన పోటీదారులుగా ఉన్నారు. మున్సిపాలిటీలో మొత్తం 23 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వారిలో 20 మంది కాంగ్రెస్, ఇద్దరు జేడీఎస్, ఒకరు ఇండిపెండెంట్ కౌన్సిలర్లు ఉన్నారు. జేడీఎస్‌కు చెందిన ఒక కౌన్సిలర్ ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ బలం 21కి చేరింది.

పొన్నసముద్రం అధ్యక్షురాలిగా సిద్ధగంగమ్మ



సిద్ధగంగమ్మను అభినందిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని పొన్నసముద్రం గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా కాంగ్రెస్ మద్దతుదారురాలు సిద్ధగంగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం అధ్యక్ష స్థానానికి నిర్వహించిన ఎన్నికల్లో ఆమె ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. నూతన అధ్యక్షురాలు సిద్ధగంగమ్మను పలువురు అభినందించారు.

పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి



కోల్‌కత్తాలో వైద్యురాలి హత్యాచార ఘటన చాలా దురదృష్టకరం. ఆపద సమయాల్లో ప్రాణాలు కాపాడుతున్న మాలాంటి వారికే భద్రత లేకుండా పోతోంది. వైద్యశాలల్లో రోజూ భయపడుతూనే విధులు నిర్వహించాల్సి వస్తోంది. రాత్రి సమయాల్లో వచ్చే తాగుబోతులను అడ్డుకునే వారే ఉండటం లేదు. వైద్యులు, సిబ్బంది భద్రత కోసం ఆస్పత్రిలో 24 గంటలూ పోలీసులను బందోబస్తుగా ఉంచాలి.

– లక్ష్మీదేవి, పీహెచ్ఎన్, అగళి

కఠిన చట్టాలు తీసుకురావాలి



కోల్‌కత్తా జరిగిన సంఘటన దురదృష్టకరం. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా మహిళా డాక్టర్లే, సిబ్బంది రక్షణ కోసం కఠినమైన చట్టాలను తీసుకురావాలి. ప్రభుత్వాస్పత్రుల్లో సీసీ కెమెరాలు, పోలీసుల గస్తీ తప్పకుండా ఉండాలి. పురుషులతో పోటీ పడి ప్రతి రంగంలో మహిళలు సమానంగా పని చేస్తున్నారు. మహిళలు పని చేసే చోట తగిన భద్రత కల్పించాల్సిన ఆవశ్యకతను కోలకత్తా వైద్యురాలి ఘటన సూచిస్తోంది.

– నరేష్‌కుమార్ వైద్యుడు, కదిరేపల్లి పీహెచ్‌సీ ,మడకశిర మండలం

ముస్తాబవుతున్న గణనాథులు

- వివిధ ఆకృతులు, రంగులతో సిద్ధం
- ఇళ్లలో పూజలకు మట్టి వినాయకులు
- రూ.50 నుంచి రూ.25 వేల వరకూ ధరలు



వినాయక విగ్రహాలను సిద్ధంగా ఉంచిన దృశ్యం

మడకశిరరూరల్: వినాయక చవితి ఉత్సవాలకు బొజ్జ గణపయ్య విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. కులమతాలకు అతీతంగా అందరూ ఎంతో సంబరంగా వాడవాడలా గణపతి మంటపాలను కొలువుదీర్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. అత్యంత వేడుకగా నిమజ్జనోత్సవాన్ని నిర్వహిస్తారు.

30 ఏళ్లుగా విగ్రహాల తయారీ

మడకశిర మండల పరిధిలోని ఆగ్రంపల్లిలో మూడు కుటుంబాల సభ్యులు విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. విగ్రహాల తయారీదారుడు మురళీ మోహన్ 8 మంది సిబ్బందితో 6 నెలల నుంచి వివిధ ఆకృతులు, రంగులతో అర్ధ అడుగు నుంచి 16 అడుగుల వరకూ గణనాథులను తయారీ చేసి విక్రయించడానికి సిద్ధం చేశారు. ఇక్కడ తయారు చేసిన వినాయ విగ్రహాలను ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల్లోని వివిధ గ్రామాలు, పట్టణాలు, నగరాలకు చెందిన వారు ముందుగా అడ్వాన్స్ చెల్లించి తయారు చేయించుకుంటున్నారు. అదే విధంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఇళ్లల్లో పూజలు నిర్వహించుకోవడానికి మట్టి వినాయక విగ్రహాలను వివిధ రూపాల్లో తయారీ చేశారు.

ధరలు ఇలా

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ)తో 16 అడుగుల వరకూ భారీ విగ్రహాలు, 3 అడుగుల మట్టి వినాయకుల తయారు చేసి విక్రయించడానికి సిద్ధం చేశారు. రూ.50 నుంచి రూ.25 వేల వరకూ ధరలు నిర్ణయించారు. ఎక్కువ మంది రూ.15 వేలకు పైబడిన విగ్రహాల కొనుగోలుకు ఆసక్తి చూపుతూ అడ్వాన్స్ చెల్లిస్తున్నారు. సెప్టెంబర్ 7న వినాయక చవితి సందర్భంగా చూడముచ్చటగా మంటపాలు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. విద్యుత్, అగ్నిమాపక శాఖ, పోలీస్‌శాఖల నిబంధనలు, సూచనలను కమిటీ సభ్యులు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

30 ఏళ్లుగా విగ్రహాల తయారీ



ఆగ్రంపల్లిలో గత 30 ఏళ్ల నుంచి వినాయక విగ్రహాలు తయారీ చేస్తున్నాను. తయారీకి పెట్టిన పెట్టుబడి పోనూ ప్రతి సంవత్సరం రూ.2 నుంచి 3 లక్షల వరకూ ఆదాయం పొందుతున్నాను. ప్రభుత్వం విగ్రహాల తయారీదారులను గుర్తించి సబ్సిడీతో రుణాలు అందిస్తే ప్రత్యేకంగా విగ్రహాల తయారు చేసుకునేందు గోదాములు నిర్మించుకుంటాం.

– మురళీమోహన్, వినాయక విగ్రహాల తయారీదారుడు, ఆగ్రంపల్లి

అనుమతి తప్పనిసరి



పట్టణం, గ్రామాల్లో చవితి సందర్భంగా ఏర్పాటు చేసుకునే వినాయక మంటపాలకు కమిటీ సభ్యులు ముందుగానే స్థానిక పోలీసుస్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకుని అనుమతి తీసుకోవాలి. అదే విధంగా గొడవలు చేసుకోకుండా, పిల్లలను ఊరేగింపులో ట్రాక్టర్‌పై కుర్చోబెట్టకుండా ప్రశాంతంగా నిమజ్జనం జరుపుకోవాలి. నిమజ్జనం సమయంలో గొడవలకు అవకాశం లేకుండా కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలి.

– రాజ్‌కుమార్, సీఐ, మడకశిర రూరల్

మట్టి విగ్రహాలే ఏర్పాటు చేయాలి



మట్టి వినాయక విగ్రహాల ధర చాలా తక్కువ. ఇవి నీటిలో సులభంగా కరిగిపోతాయి. చెరువులోని మట్టితో చేసిన విగ్రహాలు పర్యావరణానికి ఏ మాత్రం హాని కలిగించవు. చెరువులో పూడిక మట్టి తీయడం వల్ల పరోక్షంగా చెరువుకు మేలు కలుగుతుంది. నీటి నిల్వ శాతం పెరిగి భూగర్భ జలాలు పెరుగుతాయి. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే ఏర్పాటు చేసుకొని పర్యావరణాన్ని రక్షించాలి.

– అలీముల్లా, ఉపాధ్యాయుడు, హిందూపురం

మట్టి విగ్రహం..పర్యావరణ హితం



మట్టితయారు చేసిన వినాయక విగ్రహం

హిందూపురం అర్బన్: వినాయక చవితి. ఈ పండుగ పేరు చెబితేనే భారీ వినాయక విగ్రహాలు గుర్తుకు వస్తాయి. పిల్లలు, పెద్దలు తేడా లేకుండా సంబరాలు చేసుకొనే పెద్ద పండుగ. గణపతి విగ్రహాలు జిల్లా వ్యాప్తంగా ఊరు వాడ తేడా లేకుండా కొలువుదీరనున్నాయి.

పీఓపీ విగ్రహాలతో పర్యావరణానికి దెబ్బ

వినాయక చవితి కోసం ఇప్పటికే విగ్రహాలను తయారు చేసే పనుల్లో కళాకారులు నిమగ్నమయ్యారు. అయితే ఇళ్ల పెట్టుకునే వినాయక విగ్రహాల వరకూ చాలా మంది మట్టి వినాయకులనే ఏర్పాటు చేసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. అయితే వినాయక మంటపాల్లో మాత్రం ఎక్కువ శాతం పీఓపీ విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. నిమజ్జనం తర్వాత పీఓపీ విగ్రహాలు త్వరగా కరగకపోగా వాటిలో వాడే రసాయనాల వల్ల కాలుష్యానికి కారణమై నీటిలో ప్రాణవాయువు స్థాయి తగ్గి జల చరాలకు ఇబ్బంది కలిగిస్తాయి. భూమిలోకి నీటిని ఇంకనీయకుండా అడ్డుకుంటాయి. దీంతో నీరు ఆవిరై వృథా అవుతుంది. అలాగే నీటి నాణ్యతపై ప్రతికూల ప్రభావాన్ని చూపి నీటి ఆమ్లత్వాన్ని టీడీఎస్ శాతాన్ని పెంచుతుంది. పీఓపీతో పాటు వాడే రంగులతో హానికరమైన పాదరసం , కాల్షియం, సీసం ఉంటుంది. ఇవి కలిసిన నీరు కిడ్నీలు, నాడీ వ్యవస్థను దెబ్బతీస్తాయి. నీటితో కలిసి థర్మాకోల్ , ప్లాస్టిక్ పువ్వులు, వస్త్రాలతో నీటి కాలుష్యం ఎక్కువ అవుతుంది. అలాంటి అపరిశుభ్ర నీటిని తాగడం వల్ల పశువులు సైతం రోగాలకు గురవుతాయి. ఇన్ని అనర్థాలకు దారితీసే పీఓపీ విగ్రహాలను పక్కన పెట్టి స్వచ్ఛంధ సంస్థలు, అధికారులు, ప్రజాప్రతినిధులు మట్టి విగ్రహాలనే వాడేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది.

నేటి నుంచి ఎస్ఏఎంపీ-1 పరీక్షలు

రొళ్ల: విద్యాశాఖ ఆదేశాల మేరకు బుధవారం నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-1 (ఎస్ఏఎంపీ-1) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. ప్రశ్నపత్రాలను ఏరోజుకారోజు పాఠశాల పరిధిలోని కాంప్లెక్స్‌లకు అందిస్తామన్నారు.

వలంటీర్లకు గౌరవ వేతనం చెల్లించండి

మడకశిర: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు వలంటీర్లకు గౌరవ వేతనం చెల్లించి ఆదుకోవాలని 17వ వార్డు కౌన్సిలర్ సుభద్ర ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి ఉన్నప్పుడు ప్రతి నెలా సకాలంలో గౌరవ వేతనం చెల్లించి ఆదుకున్నారన్నారు. వలంటీర్లకు గౌరవ వేతనాన్ని రూ.5 వేల నుంచి 10 వేలకు పెంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించండి

రొద్దం: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ నాగేంద్రను వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. ఇందులో భాగంగానే సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. మండలాభివృద్ధికి అందరి సహకారం అవసరమని తహసీల్దార్ వారికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, నాయకులు బి.నారాయణరెడ్డి, ఆర్‌పి రవిశేఖరెడ్డి, మారుతీ రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మాజీ డీలర్ అమీర్ తదితరులు ఉన్నారు.

29న ద్విచక్ర వాహనాల వేలం

హిందూపురం అర్బన్: హిందూపురం సెబ్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 29న ఉదయం 10 గంటలకు వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సమక్షంలో వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రూ.5000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన వచ్చన్నారు. ఆధార్, పాన్‌కార్డ్ తీసుకురావాలన్నారు.

పెనుకొండలోనూ..

పెనుకొండ: మద్యం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన పలు వాహనాలను ఈ నెల 29న ఉదయం 10 గంటలకు వేలం వేస్తున్నట్లు సెబ్ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వేలం ప్రక్రియలో పాల్గొనదలచిన ఔత్సాహికులు ఆధార్ జిరాక్స్‌తో తగిన ధరావత్తు చెల్లించి వేలం ప్రక్రియలో పాల్గొనవచ్చన్నారు.

ఉన్నత స్థానాలను చేరుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రగతి

హిందూపురం టౌన్: ప్రభుత్వ కళాశాలల్లోని వసతులను ఉపయోగించుకొని నిష్ణాతులైన అధ్యాపకుల మార్గదర్శకత్వంలో విద్యార్థినులు ఉన్నత స్థానాలను చేరుకోవాలని ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి పిలుపునిచ్చారు. మంగళవారం డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థినులకు ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో నూతన విద్యార్థినుల పరస్పర పరిచయ కార్యక్రమం, ప్రేరణా తరగతుల ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, ఐక్యూఏసీ సమన్వయకర్త శ్రీలక్ష్మీ, డాక్టర్ శ్రీధర్, అధ్యాపకురాలు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన

అగళి: మండల పరిధిలోని కాసాపురం, హళ్లికేర్, గొల్లహట్టి గ్రామాల్లో సబ్ యునిట్ అధికారి షమీవుల్లా, డాక్టర్ శివనంద ఆధ్వర్యంలో డెంగీ, మలేరియా నివారణ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లతో కలిసి మంగళవారం అవగాహనా ర్యాలీ చేపట్టారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సబ్ యునిట్ అధికారి షమీవుల్లా తెలియజేశారు. ఇళ్ల పరిసరాల్లోని పాత టైర్లు, టెంకాయలు, రిఫ్రిజిరేటర్స్, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వారానికోసారి డ్రైడే పాటించాలని సూచించారు. డాక్టర్లు శివనంద, గాయత్రి, సూపర్ వైజర్ నరసారెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు సుందరయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

అమరాపురం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని గుడిబండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి పద్మావతి, ఆర్డీటీ రీజినల్ మేనేజర్ మల్లికార్జున పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని హలుకూరు సమీపంలో ఉన్న ఏపీ మోడల్ పాఠశాలలో ఆర్డీటీ , మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలికలను చదివిద్దాం, బాలికలను రక్షిద్దాం అనే కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఓబులపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఏటీఎల్ మీనాక్షి, సూపర్‌వైజర్ కమలమ్మ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉరుసు ఉత్సవాలు



బెహలూల్ షా ఖాద్రీ బాబా సమాధి



దర్గా ముఖద్వారం

- బెహెలూల్ షా ఖాద్రీ దర్గాలో ప్రత్యేక ఏర్పాట్లు

పెనుకొండ: పట్టణ సమీపంలోని జాతీయ రహదారి పక్కన వెలసిన హజ్రత్ సయ్యద్ బెహెలూల్ షా ఖాద్రీ షహీద్ బాబా దర్గా సర్వమత సమైక్యతకు ప్రతీకగా విరాజిల్లుతోంది. కుల, మతాలకు అతీతంగా ఈ దర్గాకు వచ్చి స్వామివారిని దర్శించుకుంటుంటారు. కోరిన కోర్కెలు తీర్చే దైవమని భక్తుల విశ్వాసం.

28న గంధం పూజ

ఈ నెల 28న గంధం పూజ, 29న దీపారాధన ఉత్సవాలు జరుగుతాయని పీఠాధిపతులు ఆందోని షేక్ షా వలి తెలిపారు. భక్తులందరూ బాబా సమాధిని దర్శించుకుని ఉరుసు ఉత్సవంలో పాల్గొనాలన్నారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి ఉరుసుకు ప్రజలు తరలిరానున్నారు. అన్నదానం, ప్రసాద పంపిణీకి ఏర్పాట్లు చేశారు.

2న వైఎస్సార్ వర్ధంతి

మడకశిర: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సెప్టెంబర్ 2న నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రాలు, గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలను శుభ్రం చేసి కొత్తగా రంగులు వేయించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలను కూడా చేపట్టాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: జిల్లా కేంద్రంలో మంగళవారం కలెక్టర్ చేతన్‌ను కలిసి మడకశిర నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రం అందించినట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల మడకశిరకు వచ్చిన సందర్భంగా ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చడానికి చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి మడకశిర నియోజకవర్గ సమస్యలను పరిష్కరించడానికి హామీ ఇచ్చారన్నారు.

రాజకీయ కక్షతోనే సర్వే

- మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి

అమరాపురం: తనపై కక్షతో పాటు రాజకీయ దురుద్దేశంతోనే తన కుమారుడి పొలాన్ని సర్వే చేయిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. తన కుమారుడు స్వామి దినేష్ పేరిట ఉదుగూరు గ్రామం పక్కన వ్యవసాయ తోట ఉందన్నారు. పట్టాభూమి కావడంతో తాను గతంలో సర్వే చేయించి హద్దును వేసుకున్నామన్నారు. పొలం హద్దుకు ప్రహరీ ఏర్పాటు చేశామని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తరచూ తన ప్రహరీని కూల్చివేయాలని అధికారులపై టీడీపీ నాయకులు ఒత్తిడి తెస్తున్నారన్నారు. సర్వేకు సహకరించడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అయితే ఆర్‌అండ్‌బీ స్థలాన్ని కొందరు టీడీపీ నాయకులు ఆక్రమించుకున్నారని, దాని జోలికి పోకుండా తనపై వస్తున్నారని వాపోయారు. జిల్లా సర్వేయర్ వచ్చి మొత్తం భూమిని సర్వే చేసి తనకు ఉన్నటువంటి హద్దుకు ఎక్కడికి వస్తే అక్కడికి ప్రహరీ ఏర్పాటు చేసుకుంటానన్నారు. ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని తిప్పేస్వామి ఆయన తనయుడు స్వామి దినేష్ డిమాండ్ చేశారు.

శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు



శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. మంగళవారం ఆమిదాలగొంది త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఊరేగింపును మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు సాగింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు రఘువీరారెడ్డితో పాటు పలువురు ప్రముఖులు ఊరేగింపులో పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలో శ్రీకృష్ణ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తమ్మడేపల్లి, అమరాపురం, హేమావతి, నిద్రగట్ట తదితర గ్రామాల్లో శ్రీకృష్ణుని విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. దక్షిణ గొల్లహట్టిలో బుధవారం వేణుగోపాలస్వామి రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సీఐకి సన్మానం

మడకశిర: మడకశిర అప్‌గ్రేడెడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా పని చేస్తూ ఇటీవలనే బదిలీ అయిన మనోహర్‌ను మంగళవారం వాల్మీకి సేవా సమితి నాయకులు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఒడిసలమ్మ ఆలయంలో సన్మాన కార్యక్రమం జరిగింది. సీఐకి వాల్మీకి సేవా సమితి నాయకులు జ్ఞాపికను అందించి సన్మానించారు. కార్యక్రమంలో వాల్మీకి సేవా సమితి అధ్యక్షుడు మెహన్, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువులను వదిలితే చర్యలు

హిందూపురం: మున్సిపాలిటీ పరిధిలో పశువులను రోడ్లపై వదిలితే సంబంధిత యాజమానులపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. పశువులు రోడ్లపైకి రావడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రధాన వీధుల్లో మైక్ ద్వారా ఈ విషయాన్ని ప్రకటిస్తున్నామని, ఆ తర్వాత కూడా పశువులను రోడ్లపై వదిలితే కేసులు నమోదు చేస్తామన్నారు.

యోగా శిక్షకురాలి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం టౌన్: సంతేబిదనూరులోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రభుత్వ ఆయుర్వే వైద్యశాలలో యోగా శిక్షకురాలిగా పనిచేయడానికి ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైద్యశాల డాక్టర్ అనురాధ తెలిపారు. వైద్యశాలలో యోగా శిక్షకురాలి పోస్టు ఒకటి ఖాళీగా ఉందన్నారు. యోగాలో పోస్ట్ గ్రాడ్యుయేషన్, డిప్లొమా ఇన్‌స్ట్రక్టర్, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తామన్నారు.

రత్నగిరి అభివృద్ధికి కృషి

రొళ్ల: రత్నగిరి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయడానికి తనవంతు కృషి చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్సీ గుండుమాల తిప్పేస్వామి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని రత్నగిరి గ్రామాన్ని స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికులు వివిధ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.